క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో 'నా దేశం నా మట్టి' నేల తల్లికి నమస్కారం , వీరులకు వందనం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలను ఉదయం 8.30 గంటలకు మంత్రి రోజా బుధవారం ప్రారంభించనున్నారు. అ నంతరం వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో 'నా దేశం నా మట్టి' వేడుకల్లో పాల్గొంటారు.

పూర్వ విద్యార్థుల వితరణ

పుత్తూరు రూరల్: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు చేయూతనిచ్చిన పూర్వ విద్యార్థులు అభినందనీయులని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం భారతి అన్నారు. మంగళవారం పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.10 విలువ చేసే క్రీడా సామగ్రిని పాఠశాలకు అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదమిత్ర వర్క్ షాప్‌నకు మధుశేఖర్



వెదురుకుప్పం: హర్యానా రాష్ట్రంలో ఈనెల 11న జరగనున్న ఆపదమిత్ర వర్క్‌షాప్‌కు మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధి (సి–8 క్లస్టర్)లో వలంటీర్‌గా పనిచేస్తున్న సి.మధుశేఖర్ ఎంపికై నట్లు ఎంపీడీఓ సుధాకర రావు మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తిలో 2022 నవంబర్‌లో నిర్వహించిన ఆపదమిత్ర శిక్షణ తరగతుల్లో ఉత్తమ శిక్షణ పొందిన వలంటీర్లుగా ఎంపికై నట్లు చెప్పారు. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మధుశేఖర్‌ను శ్రీకాళహస్తి ఈటీసీ (ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్)ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపదమిత్ర వర్క్‌షాప్‌నకు మధుశేఖర్ ఎంపిక కావడంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మానసిక రోగులకు వైద్య పరీక్షలు


రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మానసిక రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఉదయకిరణ్ పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మతిమరుపు, మైగ్రేన్ తలనొప్పి, నిద్రలేకపోవడం వంటి అంశాలను వివరించారు. తాము న్నామనీ, ఇక మానసిక సమస్యతో బాధపడవలసిన అవసరం లేదన్నారు. అవసరమైతే 14416 హెల్ప్‌లైన్ నంబరులో సంప్రదించాలన్నారు. గ్రామీణ ప్రాంత రోగులు ఈ వైద్యసేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గఅగ్రహారం వైద్యాధికారి డాక్టర్ సి.రమేష్‌కుమార్, శివారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో నా దేశం-నా భూమి


ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన నాదేశం-నా భూమి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీదేవి అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృతోత్సవంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 9 నుంచి 15 వరకు నాదేశం–నా భూమి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగం, కీర్తి ప్రతిష్టలను అందరికీ తెలియజేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్ఐ ప్రసాద్‌కు పరామర్శ


టీడీపీ దాడిలో గాయపడిన ఎస్ఐ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న నాయకులు

పాలసముద్రం : పుంగనూరులో జరిగిన టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ఎస్ఐ ప్రసాద్‌ని మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తమ పార్టీ నాయకులతో కలసి ఆయనను పరామర్శించారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ బందోబస్తుకు వచ్చిన పోలీసులపై టీడీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. భవిష్యత్‌లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, రవి, గోపాల్, రవిరెడ్డి, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

ఓటరు సర్వే తనిఖీ

శ్రీరంగరాజపురం : ఎన్నికల కమిషన్ ఆదేశాలను సారం ఓటరు సర్వేను ప్రతి బీఎల్‌ఓ కూడా వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ లోకనాథ పిళ్లై తెలిపారు. మంగళవారం ఆయన దిగువగుంట గ్రామంలో జరుగుతున్న ఓటరు సర్వేను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ గ్రామాల్లో చనిపోయిన వ్యక్తులను ఓటరు జాబితా తొలగించాలని, డబుల్ ఎంట్రీ, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు ఉన్నా, కొత్త ఓటరు నమోదు మొదలగు వాటిని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మూడు దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

తరలిరాద తనే వసంతం.. తన దరికిరాని వనాల కోసం అంటూ ఓ సినీ కవి తన పాటలో చెప్పిన విధంగా ప్రజా సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వాలు.. మనసున్న పాలకులు ఉంటే ఏదైనా జనం చెంతకే చేరుతాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా సుదూర ప్రాంతాల్లోని పాతాళగంగ కూడా ప్రజలను వెతుక్కుంటూ వస్తుందనడానికి బుగ్గఅగ్రహారం ప్రజలకు ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీరు తార్కాణంగా నిలుస్తోంది. దీంతో మహిళల ఆనందానికి అవధులు లేవు.

- రూ.34.30 లక్షల వ్యయంతో బుగ్గ అగ్రహారం పంచాయతీకి తాగునీటి సరఫరా
- ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికల హామీని నెరవేర్చిన మంత్రి రోజా
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణ మహిళలు


బుగ్గ అగ్రహారంలో తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో తాగడానికి వీలుపడే నీరు దొరకదు. ఈ గ్రామంతో పాటు సమీప గ్రామాలైన బుగ్గ అగ్రహారం ఆదిఆంధ్రవాడ, దేశూరు కండ్రిగ, అర్జునప్పనాయుడు కండ్రిగ, ఆలపాకం కండ్రిగ, కల్యాణయ్యకండ్రిగ, వైఎస్ కండ్రిగ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. సుమారు 350 కుటుంబాలు ఈ ప్రాంతాల్లో ఉండగా సుమారు 1200 మంది జనాభా నివశిస్తున్నారు. వీరందరూ వేలావడి గ్రామానికో, పర్వతరాజపురం, ఇరుగువాయి గ్రామాలకో వెళ్లి తాగునీరు తెచ్చుకునేవారు. తెచ్చుకునే నీటిని రెండు, మూడు రోజుల పాటు జాగ్రత్తగా వాడుకునేవారు. కొందరు స్థానికంగా ఉన్న వాటర్‌ప్లాంట్ల నుంచి రోజుకో క్యాన్ చొప్పున నీటిని కొనుక్కునే వారు. ఇలా ఇక్కడి ప్రజలకు తాగునీటి సమస్య అతిపెద్ద సంకటంగా మారింది. గత పాలకులు సమస్యలు వినేవారే గానీ పరిష్కార మార్గం చూపేవారు కాదు. ఎందుకంటే ఈ గ్రామాలకు నీరు ఇవ్వాలంటే సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని కొండ అంచు నుంచి నీటిని సరఫరా చేయాలి. దీంతో ఎవరూ దీనిపై దృష్టి సారించలేదు. గత ఎన్నికల సమయంలో మంత్రి ఆర్‌కే రోజాకు స్థానిక మహిళలు తాగునీటి సమస్యను విన్నవించుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పక సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం తాగునీటి సరఫరాకు మంత్రి ఆర్‌కే రోజా అధికారులతో చర్చించి పథక రచన చేశారు. జల జీవన్ మిషన్, సీఎండీఎఫ్, జిల్లాపరిషత్, మండల పరిషత్ నిధులు కలిపి రూ.34.30 లక్షలు ఈ పనుల కోసం కేటాయించారు. అసాధ్యమని గత పాలకులు వదిలేసిన పనిని మంత్రి రోజా సుసాధ్యం చేశారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని నిరూపించారు. 30 ఏళ్ల తాగునీటి సమస్యకు ముగింపు పలికారు. నేడు గ్రామంలో ఇళ్ల వద్దే మహిళలు తాగునీరు పట్టుకుంటున్నారు. వారి ఆనందం అవధులు దాటింది.

తాగునీటి సమస్య తీరింది..



గతంలో తాగునీటి కోసం మేము పడిన ఇబ్బందులు మాటల్లో చెప్పలేం. సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. అంతదూరం వెళ్లడానికి కష్టం అనిపించి బోర్లలో నీరు పట్టుకుందాం అనుకుంటే తాగడానికి వీలుపడేది కాదు. కష్టం అనిపించినా వేరేచోటకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. మా కష్టాలు తెలుసుకున్న మంత్రి రోజమ్మ ఇన్నాళ్లకు సమస్యను పరిష్కరించారు. ఆమె మేలు మరువలేనిది.
– చిత్ర, బుగ్గఅగ్రహారం

మా బాధలు అర్థం చేసుకున్నారు



ఎన్నికల సమయంలో స్థానికులంతా కలిసి తాగునీటి సమస్యను మంత్రి ఆర్‌కే రోజా దృష్టికి తెచ్చాం. బోర్లలో నీరు ఉప్పుగా ఉండడంతో తాగడానికి వీలుపడడం లేదని విన్నవించాం. ఎక్కడ బోరువేసినా ఉప్పు నీరే వస్తుందని అధికారులు చెబుతున్నారని, మా సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని కోరాం. సాటి మహిళగా మా సమస్యను అర్థం చేసుకున్న మంత్రి రోజా అసాధ్యమైన పనిని మా కోసం సుసాధ్యం చేసి నేడు తాగునీరు అందిస్తున్నారు.
– లల్లి, బుగ్గఅగ్రహారం

అదనంగా ఖర్చు చేసేవాళ్లం..



బోర్లలో వచ్చే నీరు తాగడానికి వీలు కాకపోవడంతో వాటర్ ప్లాంట్ల నుంచి నీరు తెచ్చుకునేవాళ్లం. రోజుకు 20 లీటర్ల క్యాన్ అంటే నెలకు రూ.300 ఖర్చు చేయాల్సి వచ్చేది. వంట తయారీకి కూడా కావాలంటే మరో 300 వెచ్చించాల్సిందే. ప్రస్తుతం ఆ సమస్య లేదు. సుదూర ప్రాంతంలో కొండ అంచుల్లో బోరు వేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఈ మంచి పని చేసిన మంత్రి రోజమ్మకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.
– జ్యోతి, బుగ్గ అగ్రహారం

మా బాధ రోజమ్మకే అర్థమైంది..



ఇంటిల్లిపాదికి సరిపడా నీటిని సిద్ధం చేసి ఉంచాలంటే ఇదివరటిలో అది గగనమే. తాగునీరు తీసుకురమ్మని బిందెలిచ్చి పిల్లల్ని ద్విచక్రవాహనంలో పంపేవారం. వారు వాహనానికి రెండువైపులా నీటిబిందెలను కట్టుకుని నీళ్లు తెచ్చేవారు. ఈ కారణంగా వారు ఇంటికి చేరేంతవరకు మాకు భయంగా ఉండేది. ప్రస్తుతం అలాంటి బాధలు తప్పింది. నేడు ఇళ్లవద్దే తాగునీరు అందుతోంది. ఇది మంచి మనసుతో మంత్రి రోజమ్మ సాయం చేశారు.
– మీనాక్షి, బుగ్గఅగ్రహారం

మంత్రి సహకారంతోనే సాధ్యమైంది



ప్రస్తుతం అందిస్తున్న నీరు కొండఅంచు నుంచి వస్తోంది. ఆ ప్రాంతంలో బోరు వేసి అక్కడి నుంచి సుమారు 6 కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేసి నీటిని తేవడమంటే అది మాటల్లో చెప్పినంత సులభం కాదు. మంత్రి రోజా దృష్టి సారించి జలజీవన్ మిషన్, సీఎండీఎఫ్, జిల్లాపరిషత్, మండల పరిషత్ నిధులు మొత్తం రూ.34.30 లక్షలు కేటాయించారు. పైపులైన్ ఏర్పాటుకు సమస్యలన్నీ పరిష్కరించా. సమస్యల పరిష్కారంలో ఆమె ఎప్పుడూ ముందుంటారు అనడానికి ఇది ఒక ఉదాహరణ.
– రవి, సర్పంచ్, బుగ్గఅగ్రహారం

మానవ హక్కుల సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా చిరంజీవిరెడ్డి


రాష్ట్ర నాయకులతో జిల్లా ఇన్‌చార్జ్ చిరంజీవిరెడ్డి

నగరి : అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తిరుపతి, చిత్తూరు జిల్లాల ఇన్‌చార్జ్‌గా నగరి పట్టణానికి చెందిన చిరంజీవి రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం నగరి పట్టణంలో నిర్వహించిన మానవ హక్కుల సంఘ సమావేశంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన రావు ఈ మేరకు ప్రకటించారు. సమాజంలో మానవ హక్కుల పట్ల అవగాహన కల్పిస్తూ హక్కుల ఉల్లంఘనని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడ్డాలని సూచించారు. ఈ సందర్భంగా చిరంజీవిరెడ్డి రాష్ట్ర అధ్యక్షులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్రస్థాయి నాయకులు డాక్టర్ రవీంద్ర భరత్, దామోదర్ రావు, విల్లూరి పైడారావు, కేవీఎస్ నాయుడు, మల్లేశ్వరరావు, అప్పలనాయుడు, లింగరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సీడీపీఓ వినతిశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. మండలంలోని ఆత్మకూరు అంగన్‌వాడీ కేంద్రానికి అంగన్‌వాడీ కార్యకర్త(మెయిన్), అలాగే ఈదరపాళ్యెం,(రామానాయుడుపల్లి), మినీ అంగన్‌వాడీ, కలిజవేడు, బాలాపురం, పాత వెంకటాపురం, దళవాయిపల్లి అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగాలకు, పెనుమూరు మండలంలో కె. గొల్లపల్లి అంగన్‌వాడీ హెల్పర్, పాలసముద్రం మండలం వనదుర్గాపురంలో అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ విద్యాహర్హత సర్టిఫికెట్లు, ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు.

మెటీరియల్ వితరణ

పుత్తూరు రూరల్: మండలంలోని గోపాలకృష్ణాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి సారథి భౌతిక, రసాయన శాస్త్ర మెటీరియల్‌ను వితరణగా అందజేశారు. మంగళవారం స్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయుల బదిలీ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

–జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండల కేంద్రంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం పెనుమూరులోని సర్వే నంబర్ 430లో పట్టాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు జేసీ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లడుతూ మండల కేంద్రంలో అనర్హులకు, బయట ప్రాంతాల వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని ఫిర్యాదు రావడంతో సందర్శించినట్లు చెప్పారు. విలువైన ప్రదేశంలో ఎలాంటి పట్టాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలను వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్ కళావతిని ఆదేశించారు. ఏబీ కాలనీలోని జగనన్న కాలనీలో పట్టాలు గుట్టపై ఇవ్వడంతో లబ్ధిదారులు కొందరు ఇళ్ల నిర్మాణాలు చేయలేకపోతున్నారని విచారణలో తెలియడంతో వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు గుర్తించి వారికి స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, ఎంపీటీసీ యశోదారెడ్డి, మోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, దాము తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సుపరిపాలనకు నాంది


సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: నవరత్న పథకాలతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలనకు నాంది పలికారని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలో బొమ్మయ్యపల్లె దళితవాడ, చిన్నబొమ్మయ్య పల్లె, గ్యారంపల్లె, రామకృష్ణాపురం, తిప్పినాయుడు పల్లె దళిత వాడ, తిప్పినాయుడు పల్లెల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా వారి జీవన ప్రమాణాల మెరుగుపరిచేందుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం టీడీపీకి అనుకూలంగా ఉన్నవారికే అరాకొరా లబ్ధి చేకూర్చారని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వంలో సీఎం జగనన్న ప్రభుత్వంలో కేవలం అర్హతే ప్రామాణికంగా చూస్తున్నారని చెప్పారు.

నాడు మతకల్లోలాలు.. విధ్వంసాలే..

గత చంద్రబాబు పాలనలో గ్రామాల్లో వర్గ విభేదాలు, మత కల్లోలాలు, విధ్వంసాలు ప్రేరేపించారని చెప్పారు. చంద్రబాబు పాలనంతా అభూత కల్పనలు, పచ్చి అబద్ధాలు మోసాలతో కూడకుంటే నేటి సీఎం వైఎస్ జగనన్న పాలనలో ప్రేమ, ఆప్యాయత, వాత్సల్యంతో కూడుకున్న పరిపాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పురుషోత్తం, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సుధాకరరావు, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ చెంగల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యం, నా యకులు ధనంజయరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో భాగంగా 5 ఏళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా చేయాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏఎన్ఎం రాధ సమక్షంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా అన్నిరకాల వ్యాక్సినేషన్లపై వివరించారు. ముఖ్యంగా చిన్నారులకు జన్మించిన 24 గంటలో వ్యాధినిరోధక టీకాలు వేస్తేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరోహర.. సుబ్రమణ్యేశ్వర..

- కుమారగిరిపై ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణం వీక్షించడానికి భారీగా విచ్చేసిన భక్తులు
- భక్తులను ఆకట్టుకుంటున్న విద్యుత్ దీప కాంతులు


ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేపట్టి వేద పండితులు వేద మంత్రాల నడుమ ఆడికృత్తిక ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంకురార్పణ, గణపతి హోమం, భరణీ అభిషేకం, ధూపదీప నైవేద్యాలు చేపట్టారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. పలువురు భక్తులు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలు..

వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ఆనుకుని కుమారిగిరిపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలో స్వామివారి ప్రతిమలతో కూడిన భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్కంధపుష్కరిణి చుట్టూ, పుష్కరిణిలోని నీరాలి మండపాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. పుష్కరిణిలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో ఈఏడాది తెప్పోత్సవాలు నిర్వహించడం లేదని ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి తెలిపారు.

ఉత్సవాల ఏర్పాట్లపై సంతృప్తి..

వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను చిత్తూరు ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం సందర్శించి ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డిని అభినందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు అసిస్టెంట్ కమిషనర్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. కార్యక్రమానికి ఉభయదారులుగా ఎంపీపీ లత, బాలాజీ, ధనుంజయరెడ్డి, రాధికారెడ్డి, కృష్ణ యాదవ్, తులసి, దీపక్‌రెడ్డి, కీర్తన, శశిధర్‌రెడ్డి, కవిత, వెంకటరమణ(యూఎస్ఎ), బాలసుబ్రమణ్యం, శాంతి, చంద్రారెడ్డి, రాధారమణి, పట్టుబాల చిరంజీవిరెడ్డి, జ్ఞానాంబ, లోకనాథం, జయమ్మ దంపతులు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో భరణి కావళ్లు


పంబవాయిద్యాలతో కావళ్లు తీసుకొస్తున్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా భరణి కావళ్లు మంగళవారం ఎత్తారు. ఉదయం కావళ్లను నీటితో శుభ్రం చేసి మధ్యాహ్నం కావళ్లకు పసుపు, కుంకుమ, చందనం వివిధ పుష్పాలతో అలంకరించి వారి పూజగదిలో ఉంచి కర్పూరం వెలిగించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పంబవాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి పసుపు రంగుల్ల దుస్తులతో కావళ్లను వరుస క్రమంతో ఆటపాటలు పాడుతూ, నృత్యాలు వేస్తు ఉత్సాహంగా కావళ్లు ఎత్తారు. అనంతరం తిరుత్తణి మురుగ వళ్లిదేవసేనమ్మను, దర్శించడానికి వెళ్లారు. శ్రీకావేరిరాజుపురంలో పంబవాయిద్యాలతో ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా కావళ్లను తిరుత్తణికి మురుగ వళ్లిదేవసేనమ్మను దర్శించడానికి వెళ్తున్న భక్తులు.

పుత్తూరులో పండుగ శోభ

- నేడు భరణి, రేపు ఆడి కృత్తిక


విద్యుత్ దీపాలంకరణలో పుత్తూరు శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం


భరణి కావళ్లతో తరలివస్తున్న భక్తులు

పుత్తూరు రూరల్: ఆడి కృత్తికను పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలో మంగళవారమే పండుగ శోభ సంతరించుకుంది. బుధవారం భరణి, గురువారం ఆడి కృత్తికను ఘనంగా నిర్వహించడానికి పట్టణంలోని శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం భరణి కావళ్లు ఎత్తే భక్తులతో పట్టణం సందడిగా మారింది. వివిధ గ్రామాల నుంచి కావళ్లతో తరలివస్తున్న భక్తులు పట్టణంలోని స్వామిని దర్శించుకుని తిరుత్తణికి పయనమవుతున్నారు. కావళ్లు, పసుపు, కుంకుమ, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

ఆడికృత్తిక సందడి


బస్టాండు ప్రాంగణంలో కావళ్ల విక్రయాలు

నగరి : ఆడి కృత్తిక ఉత్సవాలను నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆచరిస్తారు. ఇక్కడ నివశించే శెంగుంద మొదలియార్ కులస్తుల్లో ఈ పండుగ ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. నగరి నుంచి కావళ్లతో వెళ్లే భక్తులు తిరుత్తణి కొండకు వెళ్లి మొక్కులు చెల్లించడం పరిపాటి. బుధవారం ఆడికృత్తిక కావడంతో మంగళవారం నుంచే భక్తులు పూజా సామగ్రి కొనుగోలు చేయడం ప్రారంభించడంతో బజారు ప్రాంగణం జనంతో నిండింది. పండగ రోజు కావడంతో పూజాసామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి.

పట్టణంలో వాహనాలకు అనుమతి నిలిపివేత

ఆడికృత్తికకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుండడంతో తిరుపతి నుంచి నగరి మీదుగా తిరుత్తణి చేరుకునే బస్సులు, ఇతర వాహనాలను బైపాస్ వద్దే ఆపేస్తున్నారు. అక్కడి నుంచి ఆలయానికి నడిచి వెళ్లాల్సి ఉంది. అలాగే చిత్తూరు నుంచి తిరుత్తణికి చేరుకునే బస్సులను పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద నిలిపేస్తున్నారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి నడిచి వెళ్లాలి. కాగా తిరుత్తణిలో ఆడి భరణిని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎట్టేరి కొండపై ..

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఎట్టేరి కొండపై వెలసి ఉన్న వళ్లీ,దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో భరణికృత్తిక వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు స్వామివారికి భరణి కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఎట్టేరి, మునిరెడ్డికండ్రిగ, అప్పిరెడ్డికండ్రిగ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు.

శ్రీకాలభైరవ స్వామికి విభూది అలంకరణ


విభూది అలంకరణలో శ్రీ కాళభైరవ స్వామి

నగరి : పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం అష్టమి పూజల్లో భాగంగా విభూది అలంకరణ చేశారు. అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలుచేశారు.

దేశమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

నగరి పట్టణంలోని నేత్ర దేవత దేశమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ పొంగళ్ల మండపం వద్ద పొంగళ్లు పెట్టిన భక్తులు ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యలు పరిష్కారం


కొత్త బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ అయ్యప్ప

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం దళితవాడలో తాగునీటి సమస్యలు పరిష్కరించామని మంగళవారం సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. గ్రామంలో కొత్తగా వేసిన బోరుకు మోటారు అమర్చి మంగళవారం సర్పంచ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 2 వేల కుటుంబాలకు పైగా ఉన్న పాలసముద్రం దళితవాడ ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడేవారన్నారు. అప్పట్లో తాగునీటి సమస్యలు తీర్చాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సంవత్సరాల్లో నాలుగు కొత్త బోర్లు వేసి మోటార్లు అమర్చి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చేశామన్నారు. ఆది ఆంధ్రవాడ వరకు సిమెంట్‌రోడ్డు, పాలసముద్రం మెయిన్ రోడ్డు వరకు తారురోడ్డు వేయించినట్టు తెలిపారు.